## సద్వినియోగం చేసుకోవాలి

ఉట్నూర్, అక్టోబర్ 2: గిరిజన గురుకుల సంస్థ ఆధ్వర్యంలో 2023-24సంవత్సరానికి నీట్ లాంగ్‌టర్మ్ కోచింగ్ కోసం పీవీటీజీ తెగల విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్‌లోని హయత్‌నగర్ సీవోఈలో 50మంది విద్యార్థుల కోసం కోచింగ్ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఇంటర్మీడియట్ బైపీసీ గ్రూప్‌లో ఉత్తీర్ణులైన విద్యార్థులు తమ ధ్రువీకరణ పత్రాలతో రీజినల్ కో ఆర్డినేటర్, గిరిజన గురుకుల కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కోచింగ్ తీసుకునే విద్యార్థులకు ఉచిత భోజన వసతి, స్టడీ మెటీరియల్‌తో పాటు అనుభవజ్ఞులైన బోధనా సిబ్బందితో కోచింగ్ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. పీవీటీజీ బాలబాలికలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED

WANTED

jobs Apply Now!

★ రామకృష్ణ గ్రూప్ Hyd, VJA శ్రీమంతుల ఇండ్లలో వృద్ధుల సేవకు, బేబి కేర్, ఇంటి/ వంటపని చేయుటకు వర్కర్స్ కావలెను. భో॥ + వ॥ + జీతం: 15-22 వేలు. ఏజెంట్లకు 5000/- కమీషన్. ఫోన్: 9281452833, 9281452844.

NT-310380-AII

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads

మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన

నమస్తే తెలంగాణ

క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం

4 లైన్ల ప్రకటన కేవలం

200/- మాత్రమే

ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి

50/- మాత్రమే

3+1 స్కీం కలదు

ప్రకటనల విభాగం...

GST 5% వర్తించును

మంచిర్యాల: 91827 77676, ఆసిఫాబాద్: 91827 77679

నిర్మల్: 91827 77671, 91827 77677

# మంత్రి కేటీఆర్ హామీపై హర్షం


- పారుపల్లి, ఆస్నాద్ మండలాలు ఏర్పడితే తీరనున్న తిప్పలు
- చెన్నూర్ రెవెన్యూ డివిజన్‌గా చేస్తామనే ప్రకటనపై కూడా వెల్లివిరిసిన సంతోషం

కోటపల్లి, అక్టోబర్ 2: చెన్నూర్‌ను రెవెన్యూ డివిజన్‌తో పాటు కోటపల్లి మండలంలోని పారుపల్లి, చెన్నూర్ మండలంలోని ఆస్నాద్‌ను మండల కేంద్రం చేయాలని మందమర్రిలో జరిగిన సభలో రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ దృష్టికి ప్రభుత్వ విప్ బాల్క సుమన్ తీసుకెళ్లారు. దీనిపై మంత్రి కేటీఆర్ సానుకూలంగా స్పందించారు. దీంతో వీటి ఏర్పాటుపై ఆశలు చిగురిస్తున్నాయి. అతి త్వరలో నే ఈకల నెరవేరబోతున్నది. కోటపల్లి మండలం 31 గ్రామపంచాయతీలు, చెన్నూర్ మండలంలో 30 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. సువిశాలంగా ఉండడంతో పలు గ్రామాల ప్రజలు కోటపల్లి, చెన్నూర్ మండల కేంద్రాలకు చేరుకోవాలంటే ఇబ్బందులు పడాల్సి వస్తుంది. ఇదే విషయాన్ని ప్రభుత్వ విప్ బాల్క సుమన్ దృష్టికి స్థానిక నాయకులు, కార్యకర్తలు తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన విప్ బాల్క సుమన్ కోటపల్లి మండలంలోని పారుపల్లిని, చెన్నూర్ మండలంలోని ఆస్నాద్‌ను మండలాలుగా చేసేందుకు హామీ ఇవ్వగా ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు. తాజాగా మందమర్రిలో జరిగిన కేటీఆర్ సభలో ప్రస్తావించగా, ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. విప్ బాల్క సుమన్ కోరిక మేరకు తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ దృష్టికి రెవెన్యూ డివిజన్‌తో పాటు రెండు మండలాల ఏర్పాటు విషయాన్ని తీసుకెళ్లి ఇక్కడి ప్రజల కోరిక నెరవేర్చనున్నట్లు మంత్రి కేటీఆర్ పేర్కొనడంతో ప్రతి ఒక్కరూ ఆనందం వ్యక్తం చేశారు.

**చెన్నూర్ రెవెన్యూ డివిజన్‌తో..**

ప్రభుత్వ విప్ బాల్క సుమన్ కోరిక మేరకు చెన్నూర్ రెవెన్యూ ఏర్పాటు కానుండగా, చెన్నూర్ అభివృద్ధిలో మరింత ముందుకు పోనుంది. ప్రభుత్వ విప్ బాల్క సుమన్ ప్రత్యేక కృషి వల్ల చెన్నూర్ అభివృద్ధిలో టాప్‌లో నిలుస్తోంది. దీనికి తోడు చెన్నూర్ రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు జరిగితే డివిజన్ స్థాయి కార్యాలయాలు చెన్నూర్‌కు రానున్నాయి. ఇప్పటి వరకు మండలాల కార్యాలయాలు మాత్రమే ఉండగా, కొత్తగా డివిజన్ కార్యాలయాలు, అధికారులతో చెన్నూర్‌కు సరికొత్త శోభ రానుంది. చెన్నూర్ రెవెన్యూ డివిజన్‌తో మౌలిక వసతులు పెరగడంతో పాటు ప్రతి డివిజన్ కార్యాలయం ఇక్కడే ఏర్పాటు చేయడం వల్ల ప్రజలకు పాలన మరింత చేరువ కానుంది. చెన్నూర్ రెవెన్యూ డివిజన్ కాకపోవడం వల్ల ప్రజలకు ఎలాంటి అవసరం ఉన్నా మంచిర్యాలకు పోవాల్సి వస్తున్నది. దీంతో కోటపల్లి, చెన్నూర్ మండలాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. నూతన రెవెన్యూ డివిజన్ ఏర్పాటు జరిగినట్లయితే స్థానికంగానే పలు చేసుకోవడంతో పాటు ప్రజలకు చాలా వరకు సౌకర్యవంతంగా మారనుంది.

### అందుబాటులోకి అధికారులు



కోటపల్లి మండలంలోని పారుపల్లి మండలకేంద్రంగా ఏర్పడితే పాలన ప్రజలకు అందుబాటులోకి వస్తుంది. కోటపల్లి మండలంకేంద్రం మండలంలోని తూర్పు ప్రాంత ప్రజలకు దూరంగా ఉండడం, మండలకేంద్రానికి మా గ్రామాల నుంచి ఆర్టీసీ బస్సు సౌకర్యం లేకపోవడంతో దూరభారం ఉంది. పారుపల్లి మండలంగా ఏర్పాటయితే ప్రజల ఇబ్బందులు చాలా వరకు తీరనున్నాయి. ప్రభుత్వ విప్ బాల్క సుమన్ పారుపల్లి మండల ఏర్పాటు కోసం విశేషంగా కృషి చేస్తుండడంతో ఈ విషయాన్ని రాష్ట్ర మంత్రి కేటీఆర్ దృష్టికి తీసుకుపోవడంతో మా ప్రాంత ప్రజల కోరిక అతి త్వరలో నెరవేరనుంది.

-దుర్గం కృష్ణదాస్, బోరంపల్లి

### ఇబ్బందులు తొలిగిపోతాయి..



చెన్నూర్ మండలంలోని ఆస్నాద్ నూతనంగా మండలం ఏర్పాటు కానుండడంతో మా ప్రాంత ప్రజల కష్టాలు తీరిపోతాయి. మా ఊరు చెన్నూర్‌కు 15 కిలో మీటర్ల దూరంలో ఉంటుంది. చిన్న అవసరం ఉన్నా చెన్నూర్‌కు వెళ్లాల్సి వస్తోంది. ఆస్నాద్ మండలకేంద్రం అయితే మాకు ఆరు కిలోమీటర్ల దూరం ఉండడంతో పాటు చుట్టు పక్కల గ్రామాల ప్రజలకు అందుబాటులో ఉంటుంది. ప్రభుత్వ విప్ బాల్క సుమన్ చెన్నూర్ రెవెన్యూ డివిజన్‌తో పాటు పారుపల్లి, ఆస్నాద్ మండలాల ఏర్పాటుకు కృషి చేయడం అభినందనీయం.

-బైరి ప్రసాద్, కొమ్మెర

### ప్రజల కష్టాలు తీర్చేందుకే..



చెన్నూర్ రెవెన్యూ డివిజన్‌తో పాటు పారుపల్లి, ఆస్నాద్ మండలాల ఏర్పాటు ఇక్కడి ప్రజల చిరకాల కోరిక. ఈ రెండు మండలాలను ఏర్పాటు చేస్తే ప్రజలకు పాలన మరింత చేరువ అవుతుంది. ఆయా గ్రామాల ప్రజల కష్టాలు తీర్చేందుకే పారుపల్లి, ఆస్నాద్ మండలాల ఏర్పాటు అవసరమని గుర్తించాం. చెన్నూర్ రెవెన్యూ డివిజన్‌గా మారితే నియోజకవర్గ ప్రజలకు మరింత పాలన సౌలభ్యం ఏర్పడనుంది. ఈ విషయాన్ని ఇప్పటికే ముఖ్యమంత్రి కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లాం. ఇప్పుడు మరోసారి మంత్రి కేటీఆర్ దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన సానుకూలంగా స్పందించారు.

-బాల్క సుమన్, ప్రభుత్వ విప్

### రెవెన్యూ డివిజన్, మండలాల ఏర్పాటుతో మరింత అభివృద్ధి



చెన్నూర్ రెవెన్యూ డివిజన్‌తో పాటు పారుపల్లి, ఆస్నాద్ మండలాల ఏర్పాటుతో ఈ ప్రాంతం మరింత అభివృద్ధి చెందుతుంది. ఇక చెన్నూర్‌తో పాటు చుట్టు పక్కల గ్రామాల ప్రజలకు పాలన మరింత చేరువ అవుతుంది. అన్ని డివిజన్ కార్యాలయాలు చెన్నూర్‌కు వస్తే, ఇక అభివృద్ధిలో టాప్‌లో నిలుస్తుంది. చెన్నూర్ డివిజన్, కొత్త మండలాల ఏర్పాటుతో నియోజకవర్గ ప్రజలకు మరింత మంచి జరుగుతుంది.

- శానగొండ మురళి, చెన్నూర్

## వ్యవసాయ బావిలో పడి ఒకరి మృతి

దండేపల్లి, అక్టోబర్ 2: మండలంలోని ముత్యంపేట గ్రామానికి చెందిన బోనగిరి శ్రీనివాస్(45) మతిస్థిమితం లేక వ్యవసాయ బావిలో పడి మృతి చెందాడు. ఎస్‌ఐ ప్రసాద్, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీనివాస్ కొంత కాలం నుంచి మతిస్థిమితం లేక బాధపడుతున్నాడు. సోమవారం ఉదయం 7 గంటలకు తనకున్న కిరాణ దుకాణం తెరిచాడు. అనంతరం 8 గంటలకు మూసివేశాడు. ఈక్రమంలో దుకాణానికి వచ్చిన భార్య సుజాత, మూసివేసి ఉండడంతో, భర్తకు ఫోన్ చేసింది. ఫోన్ స్విచ్చాఫ్ రావడంతో, రెబ్బెన్‌పెల్లిలో ఉంటున్న కుటుంబ సభ్యులను సంప్రదించింది. వారు కూడా రాలేదని చెప్పడంతో, కుటుంబ సభ్యులంతా వెతకడం ప్రారంభించారు. ఈ క్రమంలో ముత్యంపేట నుంచి రెబ్బెన్‌పెల్లి దారిలోని వ్యవసాయ బావిలో ఒక శవం తేలుతుందని స్థానికులు ఇచ్చిన సమాచారంలో, వెళ్లి చూడగా శ్రీనివాస్ అని నిర్ధారించారు. మతిస్థిమితం లేకనే బావిలో పడి చనిపోయాడని భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

## సోమగూడెంలో చోరీ

కాసిపేట, అక్టోబర్ 2 : కాసిపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని సోమగూడెం గ్రామానికి చెందిన అచ్చె అర్జయ్య ఇంట్లో చోరీ జరిగింది. సుమారు రూ.6. 50 లక్షల విలువైన బంగారం చోరీకి గురైనట్లు కాసిపేట ఎస్‌ఐ గంగారాం తెలిపారు. ఎస్‌ఐ కథనం మేరకు... అచ్చె అర్జయ్య తన కుటుంబ సభ్యులతో కలిసి ముంబైలో తన బంధువుల ఇంటికి వెళ్లాడు. ఇంట్లో ఎవరూ లేరని గుర్తించిన దుండగులు ఇంట్లోకి చొరబడి ఆభరణాలను ఎత్తుకెళ్లినట్లు తెలిపారు. ఈ మేరకు అర్జయ్య బంధువు రాగుల సతీశ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు. ఎవరైన వివిధ పనులతో ఊరికి వెళ్లినప్పుడు పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు.

## జంగాంలో నేషనల్ ఫ్యామిలీ హెల్త్ మిషన్ సర్వే


జైనూర్, అక్టోబర్ 2: జైనూర్ మండలంలోని జంగాం గ్రామ పంచాయతీలో నేషనల్ ఫ్యామిలీ హెల్త్ మిషన్ ఢిల్లీ ప్రతినిధులు గ్రామ పంచాయతీలో సోమవారం హెల్త్ సర్వే నిర్వహించారు. గ్రామ పంచాయతీలో కుటుంబాలు, జనాభా, తదితర వివరాలను నమోదు చేసుకున్నారు. వచ్చే నవంబర్‌లో ఢిల్లీ నేషనల్ ఫ్యామిలీ హెల్త్ మిషన్ ఆధ్వర్యంలో మెగా హెల్త్ క్యాంప్ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ మెగా హెల్త్ క్యాంప్‌ను ఏజెన్సీ గ్రామంలోని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు. ప్రతినిధులు ఫకీరప్ప, రాజకుమార్, శ్రావణ్, వైస్ ఎంపీపీ చెర్లె లక్ష్మణ్, సర్పంచ్ కుమ్ర శ్యామ్ రావు, కార్యదర్శి మధుకర్ పాల్గొన్నారు.



సర్వే నిర్వహిస్తున్న హెల్త్ మిషన్ ప్రతినిధులు

## పనులు చేయకుండానే నిధులు డ్రా

- గ్రామసభలో సర్పంచ్‌ను నిలదీసిన ఉప సర్పంచ్, వార్డు సభ్యులు
- గ్రామ పంచాయతీ కార్యాలయానికి తాళం, ధర్నా



గ్రామపంచాయతీకి వేసిన తాళం

చింతలమానేపల్లి, అక్టోబర్ 2: మండలంలోని గంగాపూర్ గ్రామ పంచాయతీ పాలకవర్గానికి తెలియకుండా నిధులు డ్రా చేసి, వాడుకోవడంపై పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ గోమాజి విలాస్ ను సభ్యులు నిలదీశారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యాలయానికి తాళం వేసి, ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉప సర్పంచ్, వార్డు సభ్యులు మాట్లాడుతూ గ్రామంలో ఎలాంటి పనులు చేపట్టకుండా, పంచాయతీ నిధుల నుంచి రూ. 2,35,000 సర్పంచ్ తన ఖాతాలో జమ చేసుకున్నాడని ఆరోపించారు. దీనిపై గ్రామ సభలో వివరణ కోరగా, సమాధానం చెప్పకుండా వెళ్లిపోయాడు. దీనిపై ఉన్నతాధికారులు కలుగజేసుకొని, నిధులు రికవరీ చేయాలని, సర్పంచ్ పై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యదర్శి అశోక్‌కి వినతి పత్రం అందజేశారు. ఉప సర్పంచ్ బిబ్బెర కమల, వార్డు సభ్యులు ఆకిరెడ్డి రామచంద్రు, దుర్గం కీర్తి, బిబ్బెర నర్సింహులు, రాంటెంకి ఆనందరావు, గోలేటి సత్యం, సుమలత, గ్రామస్తులు సుధాకర్, చందు, అంజన్న, తులసీరాం, తిరుపతి, యువకులు, తదితరులు పాల్గొన్నారు.

## ఆదిలాబాద్ జట్టుకు 'తృతీయ'

రెబ్బెన, అక్టోబర్ 2: నిజామాబాద్ జిల్లాలో జరిగిన తెలంగాణ రాష్ట్ర స్థాయి బాల్ బ్యాడ్మింటన్ క్రీడల్లో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బాలుర జట్టు తృతీయ స్థానం సాధించినట్లు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఆర్.నారాయణరెడ్డి తెలిపారు. సెప్టెంబర్ 30వ నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు జరిగిన బాల్ బ్యాడ్మింటన్ రాష్ట్ర స్థాయి పోటీల్లో రంగారెడ్డి జిల్లా జట్టుపై గెలుపొంది తృతీయ స్థానంలో నిలిచినట్లు తెలిపారు. విజేతలను క్రీడా సంఘాల ప్రతినిధులు ఎస్.తిరుపతి, పీఈటీ భాస్కర్, మహేందర్‌రెడ్డి, మారిన వెంకటేశ్వర్లు, శంకర్, హరిలాల్, మల్లేశ్, ఆర్.శ్రీనివాసరెడ్డి, కుమ్మరి మల్లేశ్, గోపాల్ అభినందించారు.



బహుమతి అందుకుంటున్న ఆదిలాబాద్ జట్టు